# ఫైనల్ ట్రిప్

ఆరోజు ఆ లారీ కది ఫైనల్ ట్రిప్. సీటులో డ్రైవరు, ప్రక్కనే ఓనరు. రోడ్డుమీద లారీ జారిపోతూవుంది. చీకటి, కటికి చీకటి. కసాయివాడి గుండెవంటీ చీకటి. లారీ వెలుతురు పడి రోడ్డు గుండెపుళ్లు కనిపిస్తున్నాయి. రెండు ప్రక్కల చెట్లు జడల దయ్యాలులాగా వున్నాయి. ఆకాశం నల్లగా వుంది. భూమి నల్లగా వుంది. డ్రైవరు ముఖం నల్లగా వుంది. నలుపు ఆ రాత్రికి మహారాజ్ఞి.

వర్షం వచ్చే సూచన, చలిగాలి. స్టీరింగ్ పట్టుకొన్న డ్రైవరు చేతులు వణకటంలేదు. బిగుసుకుపోయాయి.

అతని చూపులు రోడ్డుమీద లేవు. ఆ క్షణంలో నూనె డాగుల చొక్కా గుండెమీదవున్న జేబులో వున్నాయి.

తెల్లని కాగితం. నాలుగు మడతల తెల్ల కాగితం నలక్కుండా వుంది. గాలి తోలింది. కదలిక మెరుపు మెరిసింది. ఆకాశపాత్ర పగిలినట్టు వంకరటింకర మెరుపు. లారీ జారి పోతూవుంది. ఉరుమురుమింది. ఆకాశంలో ఆటం పగిలినట్లు ఉరుము. వాన.

సన్న సన్నగా వాన! జల్లు! వళ్లు జలదరింత! ముఖంలో నలుపు! లారీ హారన్ మ్రోగింది. ఎదురువచ్చే కారు తప్పు కొంది. లారీ ముందుకు పోయింది.

ఓనరు వంటినిండా నిద్ర! కంటినిండా నిద్ర! తలనిండా నిద్ర! చావులాంటి నిద్ర!

డ్రైవరు కళ్లల్లో కొవ్వొత్తులు! కళ్లు కాలి కరిగిపోతున్నాయి. లారీ రోడ్డుమీద జారిపోతూ వుంది. డ్రైవరు ఓనరును చూశాడు. పళ్లు పటపట లాడించాడు. చెట్టు విరిగిపడితే వచ్చే శబ్దం పళ్ల మధ్యనుంచి వచ్చింది.

పొగాకు బేళ్లు తోలి వస్తూవుంది లారీ. ఓనరు డబ్బు తీసుకొన్నాడు. అడిగితే ఇవ్వలేదు.

అడిగింది, అప్పుకాదు. అప్పు తీసుకొన్న డబ్బు! ఇవ్వ వలసింది ఒకటికాదు, రెండుకాదు, మూడు, మూడువేలు!

డ్రైవరుకు జరుగుబడి సరిగాలేదు. డబ్బు అంతా ఓనరు డ్రైవరుదగ్గర అప్పు తీసుకోలేదు. కొంత తీసుకొన్నాడు. మిగతా కొంత జీతం ఇవ్వలేకపోతే, అప్పుగా మిగిలిపోయిన మొత్తం.

మొత్తం మూడువేలు! మూ . . డు . . వే . . లు . . . ఎప్పుడిస్తాడు?

ఓనరుకు ఒకటే లారీ! అదీ సెకెండ్ హేండ్‌ది! ఫోర్త్ హేండ్‌ది అయింది. కట్టెల అడితీ కాలిపోయింతర్వాత కుటుంబం గడవక జీతం సరిగా ఇవ్వలేకపోయాడు అందువల్ల అప్పు అయింది. పెరిగింది.

లారీకి ఆ రోజుకు అది ఫైనల్ ట్రిప్! మళ్లీ రేపు మామూలు! రోడ్డుమీద జారిపోతూవుంది.

లారీ ఓనర్‌ది బారెడు సంసారం! డ్రైవర్ ఏకాకి!

ఓనరుకు అప్పు తీర్చుకొంటూ సంసారం నెట్టుకురావటం చెడిన నిండు లారీని నెట్టు కొచ్చినంత పని!

ఓనరే కాలం కర్మం కలిసిరాక, డ్రైవింగ్ చేతగాక, క్లీనర్ అయ్యాడు.

ఆరోజు రాబడిలో తనకెంతో యింతో ఇమ్మంటే ఇప్పుడు కాదులే పొమ్మన్నాడు. లారీని పోనిమ్మన్నాడు.

డ్రైవర్ వళ్లు మండింది. అతని చేతులు స్టీరింగ్ మీద బిగుసుకుపోయాయి.

వర్షం! కుడి ఎడమల వర్షం! లారీ వెలుతురులోపడే చినుకులు వెండి దారాలు వ్రేలాడుతున్నట్లున్నాయి.

లారీ వేగం అధికమయింది. జోరుగా జారిపోతూవుంది. జారుతూ పోతూవుంది.

వాన బొట్టూ లారీ అద్దంమీదపడి ముందున్న రోడ్డు మునగర దీసుకు పోతూవుంది.

అర్ధరాత్రి దాటింది. అమావాస్య చీకటి నగ్న రాక్షసిలా నవ్వుతూవుంది.

వాన చప్పుడు! ఉండి ఉండి ఉరుములు మెరుపులు! ఉరుం ఉరుంకూ గుండె మ్రోగుతూవుంది. మెరుపు మెరుపుకూ ముఖం మారుతూవుంది.

నల్లని డ్రైవరు ముఖం నల్లని జేబులోని తెల్లని కాగితం నల్లని అక్షరాలు తలుచుకొని తెల్లబడుతూవుంది.

ఓనరు చేరగిలబడి వున్నాడు, నిద్ర! బ్రహ్మాండమైన నిద్ర! ఉరుములూ మెరుపులూ తెలియని నిద్ర!

అకస్మాత్తుగా డ్రైవరు చేతులు వణికాయి. స్టీరింగ్ పొజిషన్ తప్పింది. ఒక్కక్షణం లారీ అల్లల్లాడి పోయింది.

లారీ జోరుగా తారురోడ్డుమీద జారుతూ పోతూవుంది. డ్రైవరు ఓనరు ముఖంలోకి చూశాడు. గురక లేదు. కదలలేదు. ఊపిరి ఆడటంలేదు. వెనక్కు చేరగిలబడివుంది శరీరం.

తలమీద తడి! ఎర్రటి తడి! వెంట్రుకలు అట్టగట్టుకు పోయిన తడి!

డ్రైవర్ ముఖం బిగుసుకుపోయింది. లారీ భయంగా ముందుకు పోతూవుంది.

ఆకాశంలో అట్టహాసం! చీకటి మ్రోత!! చీకటి వర్షం! వర్షపు చీకటి! చీకటి వర్షం కూడ బలుకొని అరుపులు! గాలి. విపరీతంగా గాలి. మోత!

గాలీవానా! అంతకుముందు, గంటముందు ఇంజను ట్రబులు ఇచ్చింది. ఇచ్చిందన్నాడు డ్రైవరు.

ఆగిపోయింది. డ్రైవరు దిగాడు. ఇంజన్ స్టార్ట్ చేయడానికి పూనుకొన్నాడు. చేతిలో ఐరన్‌రాడ్!

ఇంజన్ స్టార్టు కాలేదు. ఓనరు దిగాడు. డ్రైవరు ప్రయత్నించాడు.

ఇంజను స్టార్టు కాలేదు. ఓనరు జేబులో నెలరోజుల లారీ బాడుగ!

ఇంజను స్టార్టు కాలేదు. డ్రైవర్ లారీని తిట్టాడు. లారీ పాతది. ఓనరు డ్రైవరును తిట్టాడు. డ్రైవర్ ఓనర్-కామ్-క్లీనర్‌ని తిట్టాడు. మాటా మాటా పెరిగింది. మాటకు మాట తెగులు. నీటికి పాచి తెగులు! రోడ్డుకు నీరు తెగులు!

మాటా మాటా పెరిగింది. డ్రైవరు చేతిలో ఐరన్‌రాడ్ బారు పెరిగింది. పైకి లేచింది.

ఒకే దెబ్బ! ఒక్కటే దెబ్బ! క్రిందపడ్డాడు ఓనరు. స్పృహ తప్పింది—కాదు—నిద్రవచ్చింది—కాదు—గుండె ఆగింది.

ఓనరును సీటులో తెచ్చి పడేశాడు. అంతకుముందే డ్రైవరు జేబులో కాగితం వుంది. పైకితీశాడు. ఏమో వ్రాసివుంది. క్రింద స్టాంపు లున్నాయి. బొటనవ్రేలు ముద్ర—ఓనరుది—వేయించాడు.

ప్రక్క జేబులో ఉన్న లారీ నెల బాడుగ పేంట్ జేబులో, కాగితం చొక్కా జేబులో పెట్టుకొన్నాడు డ్రైవరు.

తక్షణం లారీ కదిలింది! ఆగకుండా వెళుతూవుంది. వేగంగా వెళుతూవుంది.

వాన వొడుపు వొడుపు చూపుతూవుంది. లారీ పురిటి నొప్పులు పడుతూవుంది.

ఆకాశంలో మెరుపు!

డ్రైవరు కళ్లల్లో మెరుపు!!

కాగితం తీసి, మడతలు విప్పి చూశాడు. చూచుకొన్నాడు.

కళ్లల్లో మెరుపు!

ఆకాశంలో మెరుపు!!

భూమ్మీద నీరు! ఆకాశంలో నీరు! లారీ క్రింద నీరు! డ్రైవరు ముఖంలో నీరు!

నీరు! నీరు!! నీరు!!! ఎక్కడ చూచినా నీరు! ఎటునుంచి వచ్చినా నీరు!

ముఖం వణికింది. వళ్లు వణికింది. చేయి వణికింది. లారీ వణికింది.

వణుకు! వణుకు!! వణుకు!!! భూమ్యాకాశాలు వణికి పోతున్నాయి!

నడవటం చేతగాని నంగనాచి రాక్షసిలాగా పోతూవుంది లారీ!

డ్రైవరు ముఖంలో కోపం! చేతుల్లో కోపం! లారీలో కోపం!

రోడ్డుమీద నీళ్లు లారీ కోపానికి చెదిరి చెల్లాచెదురుగా పోతున్నాయి.

వానా గాలీ! డ్రైవరు ముఖం కదులుతూవుంది. ఓనరు ముఖం చూచిన డ్రైవరు గుండె కదులుతూవుంది.

లారీ స్టేరింగ్ కదిలింది. వణికింది.

చక్రాలు జారాయి. లారీ రోడ్డు దిగింది.

ఎదురుగా మోటు బావి!

విపరీతంగా గాలి!

జోరుగా నీరు!

బ్రేకులు పడని లారీ!!

ప్రక్క చెట్టు పెళపెళ విరిగిన సవ్వడి!

చీకటి!

డ్రైవరు కళ్లనిండా చీకటి!

ఎటుచూచినా చీకటి!

బుడబుడ ధ్వని! పెళపెళ ధ్వని! చీకటి! ధ్వని! గాలి! ధ్వని! వాన! ధ్వని! వానా గాలీ!! ధ్వనీ ధ్వనీ!! చీకటిలో గాలీ వానా ధ్వనులు! ధ్వనులు!! ధ్వనులు!!!

తెల్లవారింది.

వాన తగ్గింది.

నీరు పొర్లుతూవుంది.

మోట బావి గుర్తు తెలియకుండా అంతటా నీరు!

బావిపైన విరిగిపడిన చెట్టు మూత!

ఆ చెట్టు కొమ్మ ప్రక్క మడతలు విడిపోయి అక్షరాలు చెరిగిపోయి కాగితం—స్టాంపు కాగితం.

ఆ రాత్రి ఆ లారీ కది ఫైనల్ ట్రిప్!